సాక్షి
శ్రీకాకుళం
శనివారం। 5। ఏప్రిల్। 2025



ఆదిత్యా క్షమించవా..
ఆదిత్యుని వార్షిక కల్యాణ క్రతువుకు ప్రచారం కరువైంది. ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ కూడా జరగలేదు.
- 8లో



రిమ్స్‌లో ఇన్ని సమస్యలా..?
రిమ్స్ ఆస్పత్రిని కలెక్టర్ పరిశీలించారు. సమస్యలు చూసి నిర్ఘాంతపోయారు.
- 8లో



అనుమానంతోనే..
ఐదు నెలల గర్భిణి హత్య కేసు తేలింది. అనుమానంతో భర్తే చంపేసినట్టు పోలీసులు నిర్ధారించారు.
- 8లో

న్యూస్‌రీల్

ఆన్‌లైన్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: డీఎస్సీ రాయనున్న అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందించనున్నామని, ఈ శిక్షణకు గాను ఈనెల 10వతేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమాధికారి ఇ.అనురాధ తెలిపారు. మెగా డీఎస్సీ టెట్ పరీక్షలో అర్హత సాధించిన శ్రీకాకుళం జిల్లా వాసులైన బీసీ, ఈడబ్ల్యూఎస్, ఈబీసీ కేటగిరీలకు చెందిన వారు ఉచిత శిక్షణకు అర్హులని తెలిపారు. టెట్ ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులని, టెట్ పరీక్షల మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో శ్రీకాకుళంలోని 80 అడుగులు రోడ్డులో గల ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌కు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం ఫోన్ నంబర్లు 7382975679, 9295653489ను సంప్రదించాలని తెలిపారు. అభ్యర్థులు పది, ఇంటర్మీడియెట్, డిగ్రీ మార్కుల జాబితాలు, టెట్ మార్కుల జాబితా, రెండు ఫొటోలు అందజేయాలని తెలిపారు.

రిమ్స్‌లో ప్రత్యేక ఓపీ క్లినిక్‌లు

శ్రీకాకుళం: శ్రీకాకుళంలోని రిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రిలో కొన్ని రకాల దీర్ఘకాలిక రోగాలకు ప్రత్యేక ఓపీ క్లినిక్‌లను కొన్ని రోజుల పాటు నిర్వహించనున్నామని రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక క్లినిక్‌లో సంబంధిత వ్యాధి లక్షణాలు గల వ్యక్తులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సౌకర్యాన్ని పొందవచ్చన్నారు. ఈ క్లినిక్‌లో పాల్గొనే వారంతా వ్యాధికి సంబంధించిన పాత రికార్డులు, వారి ఆధార్ కార్డుతో పాటు సంబంధిత వ్యక్తి మొబైల్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఈనెల 7వ తేదీన మూర్ఛ వ్యాధి, 10వ తేదీన రొమ్ము వ్యాధులు, 11వ తేదీన థైరాయిడ్ సమస్యలు, 15వ తేదీన హెర్నియా, కడుపులో వాపులు, బీర్జాలు, 16వ తేదీన పచ్చ కామెర్లు, కాలేయం తదితర సంబంధిత సమస్యలు, 23వ తేదీన పాదాల వ్యాధులు, మధుమేహంకు సంబంధించిన పాదాల సమస్యలున్న వారంతా హాజరుకావచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత వ్యాధిగ్రస్తులు ఈ ప్రత్యేక ఓపీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటిలో గ్యాస్ లీక్



గ్యాస్ సిలిండర్ నుంచి వెలువడుతున్న మంటలు

హిరమండలం: హిరమండలంలోని చిన్నకోరాడ వీధిలో పెను ప్రమాదం తప్పింది. వీధిలోని దేవరశెట్టి శ్రీనివాసరావు భార్య శ్రీదేవి శుక్రవారం ఇంటిలో వంటచేయడానికి గ్యాస్‌స్టవ్‌ను వెలిగించగా.. ట్యూబ్ ద్వారా గ్యాస్ లీకై సిలిండర్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ఆమె భయంతో ఇంటి బయటకు పరుగులు తీశారు. వెంటనే చిన్నకోరాడ సెంటర్‌లో హోటల్ నిర్వహిస్తున్న భర్తకు విషయం చెప్పారు. అప్పటికే ఇంటి నిండా పొగలు కమ్ముకున్నాయి. గ్యాస్ ఏజెన్సీకి, కొత్తూరు అగ్ని మాపక కేంద్రానికి స్థానికులు సమాచారం ఇవ్వడంతో.. గ్యాస్ కార్యాలయం నుంచి వచ్చిన కృష్ణంరాజు సిలిండర్ నుంచి వచ్చిన మంటలను పూర్తిగా అదుపు చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి మంటలు అదుపులోకి వచ్చాశాయి.

వెళ్లొస్తాం నేస్తం..





తెలినీలాపురం గ్రామంలో ఉన్న విదేశీ పక్షుల విడిది కేంద్రంలో ఉన్న సైబీరియా పక్షులు

నేస్తాలూ.. ఎలా ఉన్నారు..?
ఎండలు మండిపోతున్నాయి కదూ..
మేం బయల్దేరాల్సిన వేళయ్యింది.
ఎండలు ఇంకా ముదరక మునుపే
సొంతూళ్లకు వెళ్లిపోవాలి.
ఒకటా.. రెండా.. నాలుగు వేల కిలోమీటర్ల దూరం వెళ్లాలి కదా..
మేమండీ సైబీరియా నుంచి వచ్చే పక్షులం.
వచ్చి చాలా కాలమైపోయింది కదా..
బిడ్డలు కూడా ఎదిగి ఎగరడానికి సిద్ధమయ్యారు.
అందుకే తిరుగు ప్రయాణానికి అందరం సర్దుకుంటున్నాం..
సైబీరియా నుంచి మా 'పెలికాన్' వాళ్లమంతా కలిసి 410 మంది వచ్చాం..
ఇప్పుడు మా పిల్లలతో 650 మంది కలిసి తిరిగి వెళ్తున్నాం..
అలాగే మా బంధువులైన 'పెయింటెడ్' ఇంటి వాళ్లు కూడా 996 మంది వచ్చారు..
ఇప్పుడు వాళ్లంతా 1724 మంది అయ్యారు..
ఇలా మా సంతానం పెరగడం
తేలి నీలాపురం పుణ్యమే..
అందుకే ఏటా మా పుట్టినింటి నుంచి ఈ మెట్టినింటికి వస్తుంటాం.
మా రాకతో మీ పంటలు బాగా పండుతాయని మీరు నమ్ముతారు..
కానీ ఈ ప్రేమతో మా సంతతి వృద్ధి చెందుతుందని మేము నమ్ముతాం..
ఏటా ఈ సమయానికి మా గుండె బాధతో బరువెక్కుతూ ఉంటుంది..
ఇంత ప్రేమగా చూసుకునే మిమ్మల్ని వదిలి వెళ్లడం మాకూ కష్టంగానే ఉంటుంది..
కానీ ఏం చేస్తాం..
మళ్లీ రావాలంటే ఇప్పుడు వెళ్లాలి కదా..
మాకు కూడు గూడుకు ఇక్కడ ఏ లోటూ లేదు..
అక్కడక్కడా చిన్న చిన్న లోటుపాట్లు కనిపిస్తూనే ఉంటాయి..
అవి మీకూ తెలుసు..
మేం మళ్లీ వచ్చే సమయానికి అవి సరిచేస్తారు కదూ.. ఇప్పటికే ఆలస్యమైంది...
ఇక వెళ్లొస్తాం నేస్తం..

ఇట్లు
మీ సైబీరియా అతిథి విహంగాలు
- టెక్కలి రూరల్

వారి బాధ ‣ సర్వేశ్వరుడికే ఎరుక



ఒకప్పుడు ఇంటింటా పథకాలు పంపిణీ చేసి.. అర్హులందరికీ సంక్షేమాలు అందించి అందరి బంధువుల్లా మారిన సచివాలయ కార్యదర్శులు ఇప్పుడు అనారోగ్యం పాలవుతున్నారు. ఏదో పగ పట్టినట్టు ఉన్నతాధికారులు వరుస పెట్టి సర్వేలు అప్పగిస్తుండడం.. 'ఎవరో' కావాలనే చేస్తున్నట్లు విపరీతమైన ఒత్తిళ్లకు గురిచేస్తుండడంతో చిరుద్యోగులు నలిగిపోతున్నారు. లక్ష్యాలు పూర్తి చేయలేక ఒకవైపు.. పని ఒత్తిడితో కుటుంబ సభ్యులతో గడపలేక మరోవైపు చితికిపోతున్నారు.

- మానసిక ఒత్తిడిలో సచివాలయ కార్యదర్శులు
- టెన్షన్ పెడుతున్న వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే
- లక్ష్యాల మేర సర్వే పూర్తి చేయాలని అధికారుల ఒత్తిళ్లు
- అర్ధరాత్రయినా పనిచేయాల్సిందేనని హుకుం
- అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

'అర్ధరాత్రయినా సరే పనిచేయాల్సిందే.. ఏ రోజుకు ఆ రోజు సర్వే చేపట్టాల్సిందే.. తేడా వచ్చిందో కలెక్టర్‌తో మాట్లాడాల్సి వస్తుంది జాగ్రత్త..' ఇలాంటి బెదిరింపులతో సచివాలయ కార్యదర్శులకు విధి నిర్వహణ కత్తిమీద సాములా తయారైంది. కూటమి ప్రభుత్వం చెప్పిన హామీలు చేయడం లేదు సరికదా.. వాటి పేరుతో సచివాలయ ఉద్యోగులను రకరకాలుగా ఒత్తిడికి గురి చేస్తోంది. రోజుకో సర్వే పేరుతో ఊపిరి సలపనివ్వడం లేదు. తమ కుటుంబాలతో సరదాగా ఉండలేని పరిస్థితిలోకి సచివాలయ ఉద్యోగులు వెళ్లిపోయారు. వలంటీర్లను నిలిపేసి, వారు చేయాల్సిన సర్వే పనులను సచివాలయ ఉద్యోగులకు అప్పగించి ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇప్పటికే అనేక సర్వేలు చేయించింది. తాజాగా వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే చేయిస్తోంది. నిరుద్యోగ భృతి అందరికీ ఇవ్వలేమని, ఇంటి దగ్గర ఉండి వర్క్ చేయడానికి ఎంత మంది ఆసక్తిగా ఉన్నారు, ఎంత మంది ఆసక్తిగా లేరు, ప్రైవేటు ఉద్యోగం ఎవరికి కావాలి, ఎవరు వద్దంటున్నారు తదితర వివరాలతో సర్వే చేయిస్తోంది. ఇంటిలో ఉన్న ప్రతి వ్యక్తికి సంబంధించి ఎంట్రీ చేసి, ఒక్కో వ్యక్తికి ఒక్కో ఓటీపీ పంపిస్తోంది. ఆ ఓటీపీ నంబర్‌ను సంబంధిత వ్యక్తులు సచివాలయం కార్యదర్శికి చెప్పాల్సి ఉంటుంది. అలా చెబితేనే ఆ సర్వే పూర్తయినట్టు. అయితే, ఇక్కడ చాలా మంది ఓటీపీ చెప్పడం లేదు. దీంతో సర్వే చేయడం సచివాలయం కార్యదర్శులకు కత్తిమీద సాములా తయారైంది.

వాట్సాప్ గ్రూపుల్లో హెచ్చరికలు

తాజాగా వర్క్ ఫ్రం హోమ్ సర్వే లక్ష్యాల మేరకు జరగడం లేదని సంబంధిత అధికారులు సచివాలయం కార్యదర్శులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. వాట్సాప్ గ్రూపుల్లోనే హెచ్చరికల వాయిస్ మెసేజ్‌లు పెడుతున్నారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక ఏదో ఒకటి చేసేయాలని కొందర్ని మైగ్రేషన్‌లో ఉన్నారని పెట్టేస్తున్నారు. పక్కనున్న నగరాలకు వెళ్లిపోయారని గ్రామీణ ప్రాంతాల్లో నమోదు చేస్తుండగా, ఆ మైగ్రేషన్‌కు సంబంధించిన వ్యక్తుల సర్వే బాధ్యతను నగరంలోని సచివాలయ కార్యదర్శులకు అప్పగిస్తున్నారు. ఇక్కడ కూడా వారెవరూ దొరకడం లేదని నగర సచివాలయం కార్యదర్శులు పెట్టేస్తున్నారు. దీనికంతటికీ సమయం ఇవ్వకుండా చకాచకా సర్వే పూర్తి చేయాలన్న ఒత్తిడే కారణం. ఫలితంగా నగరాల్లో సర్వే అనుకున్న లక్ష్యాల మేరకు జరగడం లేదు.

రాత్రిపూట ఈ టార్చర్ ఏమిటో..

మున్సిపల్ కమిషనర్లు, సహాయ కమిషనర్లు నేరుగా వాయిస్ మెసేజ్‌లు పెట్టి సచివాలయం కార్యదర్శులను హెచ్చరిస్తున్నారు. ఎంత రాత్రైనా చేయాల్సిందేనని, రేపైనా తప్పదని, రేపు కూడా ఎంత రాత్రైనా చేయాల్సి ఉంటుందని సతాయించేలా వాయిస్ మెసేజ్‌లు పెడుతుండటంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ముఖ్యంగా పొద్దుపోయాక ఈ రకమైన వాయిస్ మెసేజ్‌లు పెడుతుండటంతో రాత్రి పూట ఈ టార్చర్ ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం నగరంలో ఇలాంటి వాయిస్ మెసేజ్ సచివాలయం ఉద్యోగుల గ్రూపులో పెట్టడంతో ఇక్కడ సిబ్బంది మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రిపూట కుటుంబాలతో గడపకూడదా అర్ధరాత్రి వరకు సర్వే చేయాలా? అని మదనపడుతున్నారు. లక్ష్యాల మేర చేయకపోతే కలెక్టర్‌తో మాట్లాడాల్సి వస్తుందని, చార్జి ఫ్రేమ్ చేయాల్సి వస్తుందని హెచ్చరిస్తుండటంతో కక్కలేక, మింగలేక సతమతమవుతున్నారు. మానసిక ఒత్తిళ్లు ఎక్కువైపోతున్నాయని, ఇలాగైతే కష్టమని అంటున్నారు. ఉద్యోగులు అనారోగ్యానికి గురై ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

తేలని వాటా.. తెచ్చిన తంటా



- డీఎంహెచ్‌ఓపై ఏసీబీ దాడుల వెనుక పెద్ద ప్లాన్
- వాటాల సమస్యే కొంపముంచిందంటున్న వైద్యశాఖ వర్గాలు

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి బాల మురళీకృష్ణ అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికిపోవడం సంచలనమైంది. అయితే ఆయనతో పాటు సీసీ సురేష్‌కుమార్ కూడా బుక్కవ్వడం వెనుక పెద్ద వ్యవహారమే నడిచిందనే కథనాలు వినిపిస్తున్నాయి. ఈ దాడుల వెనుక కథ.. స్క్రీన్‌ప్లే.. దర్శకత్వం అన్నీ కార్యాలయ ముఖ్య విభాగాధికారిగా పనిచేస్తున్న 'ఆయన' అని వైద్యారోగ్య శాఖ వర్గాలు అంటున్నాయి. కాంతమ్మ అనే దివ్యాంగురాలు, సీనియర్ అసిస్టెంట్‌ను అడ్డం పెట్టుకుని కథను నడిపించారనే వాదనలు వినిపిస్తున్నాయి.

కొంప ముంచిన వాటాలు

వైద్యారోగ్య శాఖలో అవినీతి ఇప్పుడు బహిర్గతమైంది గానీ.. ఇక్కడ మామూళ్ల వసూలు చాలా మామూలు విషయమన్న సంగతి అన్ని విభాగాలకు తెలుసు. ఫైలుకు ఓ రేట్ పెట్టుకుని వ్యవహారాలు నడుస్తున్న ఈ కార్యాలయంలో కొత్తగా డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన బాలమురళీకృష్ణ తన క్యాంపు క్లర్కులను మార్చేసి జిల్లాకు చెందిన ఓ బడా నేత సిఫారసుతో సురేష్‌కుమార్‌ను సీసీగా నియమించుకున్నారు. ఇక్కడే వైద్యారోగ్య శాఖ సిబ్బందిలో లుకలుకలు బయటపడ్డాయి. కొత్త సీసీ వచ్చాక డీఎంహెచ్‌ఓ ఎవరితోనూ సంబంధం లేకుండా తన సొంత దుకాణం తెరుచుకున్నారు. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు కూడా ప్రచురితమైన సంగతి విదితమే. దీంతో అంతవరకు సాగిన 'మామూళ్ల' వ్యవహారంలో తేడాలు వచ్చాయి. అప్పటివరకు ప్రతి ఫైల్ మూవ్ ఆర్డర్‌కు కూడా విభాగానికి ఒక్కో వాటా వెళ్లేది. కొన్ని రోజులుగా అన్ని విభాగాలు వాటాలు క్యాన్సిల్ అయిపోయి నేరుగా డీఎంహెచ్‌ఓ చాంబర్‌కే మామూళ్లు చేరిపోయాయి. దీంతో వివాదాలు పెరిగి ఏసీబీకి తమ వారితో ఫిర్యాదు చేసేంత స్థాయికి చేరిపోయాయి. ఫలితంగా ఏకంగా జిల్లా అధికారి ఏసీబీ చేతికి చిక్కాల్సి వచ్చింది. పైగా ఫిర్యాదుదారురాలు కాంతమ్మపై కూడా అనేక ఆరోపణలు ఉన్నాయన్న సంగతి కూడా పాఠకులకు తెలిసిందే. ఈమె కొంత మంది నిరుద్యోగుల నుంచి ఉద్యోగాల పేరిట వసూళ్లు చేయడంతో బాధితులంతా నిలదీయడంతో కొన్ని నెలల పాటు విధులకు వెళ్లకుండా మాయమైపోయింది. ఇవే సెలవుల అనంతరం వైద్యశాఖ రీజనల్ డైరెక్టర్ వద్ద నుంచి రీపోస్టింగ్‌కు ఆదేశాలు పొందినప్పటికీ మూవ్ ఆర్డర్ ఇవ్వాల్సిన డీఎంహెచ్‌ఓ లంచం డిమాండ్ చేయగా కాంతమ్మ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసి పట్టించింది. దీనివెనుక విభాగాధిపతి ఉన్నారన్న చర్చ తీవ్రంగా సాగుతోంది. ఈ వ్యవహారంపై మంత్రి అచ్చెన్నాయుడు ఆరా తీశారు. ఇటీవల కాలంలో కూటమి ప్రభుత్వం వచ్చాక నకిలీ జాయినింగ్ ఆర్డర్ల వ్యవహారంలో కూడా ఆ కీలక ఉద్యోగి పాత్ర ఉందన్న సంగతిపై తేల్చాలని కూడా మంత్రి ఆలోచిస్తున్నట్లుగా సమాచారం.

426 మంది లబ్ధిదారులు.. 696 ఉపకరణాలు



- నేడు ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల పంపిణీ

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పాఠశాల విద్యాశాఖ–సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో శనివారం ఉపకరణాల పంపిణీ చేపట్టనున్నారు. జిల్లాలోని భవిత కేంద్రాలతోపాటు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతూ ప్రత్యేక అవసరాలుగల పిల్లలుగా నమోదైన బాలబాలికలకు ఉపకరణాలను పంపిణీ చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 426 మంది లబ్ధిదారులను గుర్తించి.. వీరికి 696 ఉపకరణాలను పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలో అత్యధిక ఉపకరణాలను అందిపుచ్చుకుంటున్న జిల్లాగా శ్రీకాకుళం నిలిచింది. సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ అధికారి ఆదేశాలు, జిల్లా ఏపీసీ డాక్టర్ ఎస్.శశిభూషణ్ సూచనల మేరకు సహితవిద్య జిల్లా కోఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు నేతృత్వంలో మండలాల కేంద్రాలకు ఇప్పటికే ఉపకరణాలను అధికారులు చేర్చారు.

విజయవంతం చేయాలి

శ్రీకాకుళంలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో ఉదయం 10 గంటల నుంచి ఉపకరణాల పంపిణీ జరుగుతుంది. దీని తర్వాత మండలాల్లోనూ పంపిణీ ఉంటుంది. – డాక్టర్ సంపతిరావు శశిభూషణ్, సమగ్రశిక్షా ఏపీసీ, శ్రీకాకుళం

ఆధార్‌కు దారి కష్టాలు



గేటు బయట పడిగాపులు కాస్తున్న వినియోగదారులు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో గల హెడ్ పోస్టల్ కార్యాలయంలో ఆధార్ నమోదు కోసం వచ్చిన వినియోగదారులు శుక్రవారం గేటు బయట పడిగాపులు కాశారు. పశు సంవర్ధక శాఖ కార్యాలయం ప్రాంగణం నుంచి పోస్టల్ కార్యాలయానికి ఉన్న గేటు మార్గాన్ని పశు సంవర్ధక శాఖాధికారులు మూసివేశారు. దీంతో ఆధార్ నమోదుకు వచ్చిన వారితో పాటు పోస్టల్ సిబ్బంది గేటు బయట పడిగాపులు కాశారు. కొంత సమయం తర్వాత పశు సంవర్ధక శాఖ డీడీ జయరాజ్ కార్యాలయానికి చేరుకోవడంతో, పోస్టల్ సిబ్బందికి డీడీకి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం పోస్టల్ సిబ్బంది మాట్లాడుతూ.. గత కొన్ని దశాబ్దాలుగా ఇదే మార్గాన్ని వినియోగిస్తున్నామని, ఇప్పుడు ఆధార్ నమోదు కోసం వచ్చిన వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిని ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లినట్లు గుర్తు చేశారు. అయితే తమ కార్యాలయం ప్రాంగణం నుంచి పోస్టల్ కార్యాలయానికి వెళ్లే వారంతా పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారంటూ పశు సంవర్ధక శాఖాధికారులు చెప్పడం గమనార్హం.

వారు చెప్పిందే ముహూర్తం



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కక్షిదారులు

- స్లాట్ బుక్ చేస్తేనే రిజిస్ట్రేషన్
- చలానా తీశాకే రూ.200తో స్లాట్
- స్లాట్ సమయంలో వెళ్లకుంటే డబ్బులు పోయినట్లే
- సాంకేతిక, సమస్యలతో తప్పని తిప్పలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): భూముల క్రయవిక్రయాలకు జనం నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఇప్పటికే ఫిబ్రవరి 1 నుంచి కూటమి ప్రభుత్వం భారీగా భూములు ధరలు పెంచి ప్రజల నెత్తిన భారం వేసింది. నిత్యావసరాల సంగతి సరేసరి. విద్యుత్ బిల్లుల భారం ఇప్పుడిప్పుడే అందరికీ తెలిసి వస్తోంది. ఏదో ఒక రూపేణా ప్రజల నెత్తిన భారం వేసి ప్రభుత్వ ఆదాయం పెంచుకుపోవడమే కూటమి లక్ష్యంగా కనిపిస్తోంది. ఇప్పుడు రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా స్లాట్ బుకింగ్ సిస్టమ్ తెరపైకి తీసుకొచ్చి మరో రకంగా ప్రజల్ని ఇబ్బంది పెడుతున్నారు. సాధారణంగా మంచి ముహూర్తం చూసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవడం రివాజు. కానీ ఈ కొత్త పద్ధతితో వారు చెప్పిందే ముహూర్తంగా మారుతోంది.

స్లాట్ బుకింగ్‌తో తప్పని తిప్పలు

భూముల కొనుగోలు, అమ్మకాలు చేసుకునే వారు డాక్యుమెంట్ రైటర్ వద్దకు వెళ్లి సంబంధిత డాక్యుమెంట్ తయారు చేయించుకుని ఐజీఆర్ఎస్ సర్వీస్‌లో వివరాలన్నీ నమోదు చేసుకుని సంబంధిత వ్యక్తులు సంతకాలు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభంగా చేసుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఇవన్నీ చేస్తూ ముందస్తుగానే చలానా తీస్తేనే స్లాట్ బుక్ చేయడం జరుగుతుంది. స్లాట్ సమయానికి ఒక వేళ ఏదైనా కారణం వల్ల రిజిస్ట్రేషన్‌కు హాజరు కాలేకపోయినా.. సాంకేతిక పరమైన సమస్యలు ఉండి రిజిస్ట్రేషన్ కాకపోయినా స్లాట్ డబ్బులు పోయినట్లే. ఆ రోజులో ఎన్నిసార్లు స్లాట్ బుక్ చేస్తే అన్ని రూ.200 చెల్లించాల్సిందే. ఓ మంచి ముహూర్తాన రిజిస్ట్రేషన్ ఎవరైనా చేయించాలనుకుంటే ఆన్‌లైన్‌లో స్లాట్ దొరికితేనే వారికి రిజిస్ట్రేషన్ లేకుంటే అంతే సంగతులు. స్లాట్ బుక్ చేసుకున్నాక కొనుగోలు చేసిన వారికో అమ్మిన వారికో అనారోగ్యం వచ్చినా, డబ్బులు ఎడ్జస్ట్‌మెంట్ కాకపోయినా, బ్యాంక్‌లో చలానా తీయడం ఆలస్యం కావడం లాంటి సంఘటనలు ఎదురైతే రిజిస్ట్రేషన్ జరగదు. స్లాట్ సమయానికి సబ్ రిజిస్ట్రార్‌లు, సంబంధిత సిబ్బంది అందుబాటులో లేకపోయినా డబ్బులు వృథాగా పోతాయి. స్లాట్‌లు సరిగా జరగకపోవడంతో రిజిస్ట్రేషన్‌శాఖ కార్యాలయంలో గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

సమస్యలు సరిదిద్దుతాం

ముందుగా స్లాట్ బుక్ చేసుకుని ఆ సమయానికి ఇరు పార్టీలు హాజరైతే రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులువుగా పూర్తిచేయడం జరుగుతోంది. స్లాట్ బుకింగ్ ఈ రోజే ప్రారంభం కావడంతో చిన్నచిన్న సమస్యలున్నా సరిదిద్దుతాం. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరు స్లాట్ బుక్ చేసుకున్న తరువాతే రిజిస్ట్రేషన్‌కు వస్తే మంచిది.
– నాగలక్ష్మి, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్‌శాఖ డీఐజీ, శ్రీకాకుళం జిల్లా రిజిస్ట్రార్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల విజేతగా కావ్యశ్రీ



బహుమతి అందుకుంటున్న కావ్యశ్రీ

ఆమదాలవలస: భారత తపాలా శాఖ జాతీయ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన (లేఖా రచన) పోటీల్లో ఆమదాలవలస శ్రీవాణి విద్యానికేతన్‌లో 8వ తరగతి చదువుతున్న ఇ.కావ్యశ్రీ విజేతగా నిలిచింది. పోస్ట్ కార్డు, ఇన్‌ల్యాండ్ లెటర్, ఎన్వలప్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పాఠశాలలో తల్లిదండ్రుల సమక్షంలో శ్రీకాకుళం హెడ్ పోస్టాఫీసు సూపరింటెండెంట్ వండాన హరిబాబు రూ.25,000 చెక్‌ను అందజేశారు. సుమారు ఎనిమిది వేల మంది పాల్గొన్న ఈ పోటీల్లో కావ్యశ్రీ విజేతగా నిలవడం జిల్లాకు దక్కిన గౌరవమని సూపరింటెండెంట్ అభినందించారు. తల్లిదండ్రులు, తోటి విద్యార్థుల సమక్షంలో బహుమతి అందుకోవడం ఆనందంగా ఉందని కావ్యశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా కావ్యశ్రీకి శిక్షణ ఇచ్చిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు కె.వి.రాజారావును పాఠశాల డైరెక్టర్ బి.వెంకటేశ్వర్లు, బి.నారాయణమూర్తి, విశ్రాంత ఎంఈఓ ఎస్.వి.రమణ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్, ప్రణవి, తరుణ్, ఇందుమతి, హరిబాబు, అప్పలనాయుడు, పోస్టల్ శాఖ స్టెనో పూజారి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లు అడ్డుకోకపోవడం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముస్లింలకు అండగా ఉంటామని మభ్యపెట్టి ఓట్లు దండుకొని ఇప్పుడు వక్ఫ్ బిల్లును అడ్డుకునేందుకు కావాల్సిన బలం ఉన్నా అడ్డుకోకపోవడం దారుణమని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఎంఏ రఫీ, జిల్లా అధ్యక్షులు ఎం.ఎ.బేగ్ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం అమలుకు బాహాటంగా మద్దతిచ్చి పూర్తిస్థాయిలో బిల్లును పాస్ చేయడానికి చంద్రబాబు ప్రత్యక్ష కారణమయ్యారని ధ్వజమెత్తారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 12, 13లో ఉన్న ముస్లింల పరిరక్షణ చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచిందని దుయ్యబట్టారు. దేశ సౌభాగ్యానికి ప్రతీకలమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలకు నష్టపరిచే ప్రక్రియకు చేయి కలపడం సరికాదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఎస్.అమానుల్లా, నియోజకవర్గ అధ్యక్షుడు ముజీబుర్ రెహమాన్, పట్టణ అధ్యక్షుడు అబూబకర్, ఉపాధ్యక్షుడు సర్ఫరాజ్ భయ్యా, జహంగీర్, అజ్గర్, అలీబేగ్, సయ్యద్ రషీద్, ఎంఎ సిరాజుద్దీన్, బహదూర్ జానీ, కేఎస్ మదీనా పాల్గొన్నారు.


రూ.10 లక్షల విలువైన చెట్లు దగ్ధం



లొద్దలపేటలో కాలిపోయిన శ్రీగంధం చెట్లు

ఆమదాలవలస: మండలంలోని లొద్దలపేటలో పూజారి శ్రీలత అనే రైతు తోటలో గురువారం అర్ధరాత్రి మంటలు చెలరేగడంతో 200 శ్రీగంధం చెట్లు, 200 సర్వీ చెట్లు, కొన్ని మామిడి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయారు. భర్త ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నందున ఆమదాలవలసలో నివాసం ఉంటున్నామని, ఊరిలో తాము లేని సందర్భం చూసుకొని దుండగులు నిప్పు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేశామని, తమకు న్యాయం చేయాలని కోరారు.

బెల్లం క్రషర్ షెడ్ దగ్ధం



చేపేనపేటలో కాలిపోయిన షెడ్

ఆమదాలవలస: మండలంలో చేపేనపేటలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో బుడితి సాంబమూర్తికి చెందిన బెల్లం క్రషర్ షెడ్ కాలిపోయింది. పక్కనున్న పొలంలో పంట వ్యర్థాలను కాల్చే క్రమంలో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. షెడ్‌తో పాటు బెల్లం తయారీలో ఉపయోగించే ఇనుప పెనాలు, క్రషర్ ఇంజన్ దగ్ధమైందని, సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ఆమదాలవలస అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసినట్లు చెప్పారు.

ఆదిత్యా.. క్షమించవా!

- కనీస ప్రచారాలకు నోచుకోని వార్షిక కల్యాణోత్సవాలు
- కల్యాణ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణకు మంగళం
- సిబ్బందిపై ఆలయ ఈవో ఆగ్రహం





ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం నుంచి వార్షిక కళ్యాణోత్సవాలు (బ్రహ్మోత్సవాలు) ప్రారంభమయ్యాయి. నిజానికి ఈ కార్యక్రమంపై ఇంతవరకు ఎలాంటి ప్రచారం గానీ, ప్రకటనలు గానీ ఆలయం తరపున నిర్వహించకపోవడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం వరకు ఈ వార్షిక కల్యాణోత్సవాలను రథసప్తమి మహోత్సవాల తర్వాత అంతే స్థాయిలో నిర్వహించే వారు. ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు, అర్చకుల సమన్వయంతో అద్భుతంగా నిర్వహించిన చరిత్ర ఉంది. అలాంటిది.. ఇప్పుడా కళ లేకుండా పోయింది. రథసప్తమిని రాష్ట్ర పండుగగా నిర్వహించామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వ నేతలు..ఇప్పుడు ఆదిత్యుని వార్షిక కల్యాణోత్సవాల నిర్వహణపై కనీస స్పందన చూపించడం లేదని స్థానిక భక్తులు మండిపడుతున్నారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణేదీ?

రథసప్తమి తర్వాత అంతటి ప్రాధాన్యత గల వార్షిక కల్యాణోత్సవాలు (బ్రహ్మోత్సవాలు) ఈ నెల 4 నుంచి 12 వరకు నిర్వహించనున్నారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రమే ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమం జరిగినంత వరకు అసలు వార్షిక కల్యాణోత్సవాలు నిర్వహణపై ఎలాంటి ప్రకటన గానీ, ప్రచారాలు గానీ నిర్వహించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. కనీసం ఆహ్వాన పత్రికలు కూడా ఆవిష్కరణ జరగలేదంటే ఆలయంలో ఎలాంటి పరిస్థితులు దాపురించాయో అర్థం చేసుకోవచ్చు. గతం వరకు వార్షిక కళ్యాణోత్సవాల ఆహ్వాన పత్రికలను ఘనంగా ఆవిష్కరించే సంస్కృతి ఉండేది. ఇప్పుడా ఊసే లేదు.

సిబ్బంది గైర్హాజరుపై ఈవో ఆగ్రహం..

ఈ వ్యవహారంపై ఆలయ ఈవో వై.భద్రాజీ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా.. ఆహ్వాన పత్రికలను ఇవ్వాలని సిబ్బందికి చెప్పామని.. అయినా జరగకపోవడం వాస్తవమే అని అంగీకరించారు. అనంతరం శుక్రవారం సాయంత్రం జరిగిన ధ్వజారోహణ కార్యక్రమానికి గైర్హాజరైన రెగ్యులర్ ఉద్యోగులు, దినసరి వేతనదారులపై కూడా ఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నప్పుడు కూడా హాజరుకాకపోవడంపై మండిపడ్డారు.

ప్రత్యక్షదైవం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి వార్షిక కళ్యాణోత్సవాలు శుక్రవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. చైత్ర శుద్ధ సప్తమి నుంచి చైత్ర శుద్ధ పౌర్ణమి వరకు అంటే

ప్రారంభమైన వార్షిక కల్యాణోత్సవాలు

ఈ నెల 12 వరకు ఈ కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు శుక్రవారం సాయంత్రం ఆలయ గరుడ ధ్వజ స్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, కార్యనిర్వహణాధికారి వై.భద్రాజీల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్ఛారణలు, మంగళధ్వనుల మధ్య కార్యక్రమం జరిపించారు. పతాకావిష్కరణ, సకల దేవతాహ్వానాలు, విశేష అర్చనలు, దిగ్బలి ప్రదానం అనంతరం మహా హారతినిచ్చారు. అనంతరం ఈఓ, ప్రధానార్చకులు మాట్లాడుతూ కల్యాణోత్సవాల్లో భాగంగా ఈ నెల 7న సాయంత్రం సుగంధద్రవ్య మర్దన, 8న రాత్రి 7.30 గంటల నుంచి ఉషా పద్మినిఛాయాదేవేరులతో స్వామి వారి కల్యాణోత్సవం, 9న మధ్యాహ్నం ఆగ్నేయ స్థాలీపాక హోమాదులు, 10న ఉదయం 8.30 గంటల నుంచి పండిత సదస్సు, సాయంత్రం 4 గంటల నుంచి రథోత్సవం, 11న రాత్రి 7 గంటల నుంచి ఆలయ ఉద్యానవనతోటలో తిరుమంగయాళ్వారుల చరిత్ర, సంవాదం, 12న ఉదయం 8 గంటలకు ఇంద్రపుష్కరిణిలో చక్రతీర్థస్నానాలు, అనంతరం ధ్వజావరోహణం, రాత్రి 7 గంటల నుంచి పుష్పయాగంతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయని వివరించారు.

టెక్కలిని మున్సిపాలిటీగా మారుస్తాం

- మంత్రి అచ్చెన్నాయుడు



మంత్రి అచ్చెన్నాయుడు వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న స్థానికులు

టెక్కలి/సంతబొమ్మాళి: జిల్లా కేంద్రానికి ధీటుగా టెక్కలిని అభివృద్ధి చేస్తామని.. అయితే పంచాయతీగా ఉంటే సాధ్యం కాదు కాబట్టి దశల వారీగా మున్సిపాలిటీ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. సుమారు రూ.1.43 కోట్ల అంచనా వ్యయంతో టెక్కలి–చెట్లతాండ్ర రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా మార్గంలో పర్యటించే క్రమంలో చిరు వ్యాపారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఇక్కడే జీవనోపాధి చేస్తున్నామని ఇప్పుడు రోడ్డు విస్తరణతో రోడ్డున పడతామని వాపోయారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పిస్తామన్నారు. టెక్కలిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ప్రజలకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కుటుంబంలో ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామన్నారు. అంతకుముందు టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నూతన బస్సులను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, ఆర్అండ్‌బీ ఎస్ఈ కె.జాన్ సుధాకర్, టీడీపీ నాయకులు కె.హరివరప్రసాద్, బి.శేషగిరి, కె.లవకుమార్, ఎం.దమయంతి, ఎం.రాము, ఎల్.శ్రీనివాస్, కె.కామేష్, ఆర్ అండ్ బీ అధికారులు డీఈ రవికాంత్, జేఈ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మిస్టర్ ఆంధ్రా పోటీల్లో సిక్కోలు హవా



బాడీబిల్డర్లను అభినందిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో శ్రీకాకుళం బాడీబిల్డర్లు సత్తా చాటారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం నిర్వహించిన మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కవిటి చెందిన దుదిస్టీ మజ్జి 55 కేజీల విభాగంలో విజేతగా నిలిచారు. ఎస్.వైకుంఠరావు(శ్రీకూర్మం) 60 కేజీల విభాగంలో 4వ స్థానం, కె.అవినాష్ (పలాస) తదితరులు రాణించారు. వీరిని భీమవరానికి చెందిన ఎమ్మెల్యే అంజిబాబు, సంఘ రాష్ట్ర అసోసియేట్ సెక్రటరీ వి.విజయ్ బహుమతులు అందజేశారు. వీరిని శ్రీకాకుళం జిల్లా సెక్రటరీ కె.గౌరీశంకర్, అధ్యక్షులు తారకేశ్వరరావు, చీఫ్ పేట్రన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, వడ్డాది విజయ్‌కుమార్, బలగ ప్రసాద్, సీనియర్ బాడీబిల్డర్లు, జిమ్ నిర్వాహకులు, కోచ్‌లు అభినందించారు.

వన్యప్రాణుల సంహారం.. నలుగురిపై కేసు

సారవకోట: వన్య ప్రాణుల సంహారం చేస్తున్న నలుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సారవకోట సెక్షన్ ఆఫీసర్ ఎల్.ఈశ్వరరావు తెలిపారు. సారవకోట రిజర్వ్ ఫారెస్టు పరిధిలోని పలు చోట్ల నాటుబాంబులు ఉపయోగించి వన్య ప్రాణులను సంహరిస్తున్నారని సమాచారం అందడంతో శుక్రవారం సారవకోట, పాతపట్నం అటవీ శాఖాధికారులు మాటు వేశారు. సరుబుజ్జిలి మండలం యరగాం సమీపంలో 19 నాటుబాంబులతో సహా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో సీతంపేటకు చెందిన మోహనరావు, సరుబుజ్జిలి మండలానికి చెందిన సింహాచలం, త్రినాథరావు, ఎల్ఎన్ పేటకు చెందిన జగన్నాథంలుగా గుర్తించారు.

రిమ్స్‌లో ఇన్ని సమస్యలా?

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అసంతృప్తి



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం: జిల్లాకే ప్రధాన ఆస్పత్రిగా ఉన్న రిమ్స్ సర్వజన ఆస్పత్రిలో ఇన్ని సమస్యలు ఉంటే ఎలా అని కలెక్టర్ దినకర్ పుండ్కర్ హాస్పిటల్ అధికారులను ప్రశ్నించారు. రోగులు, విద్యార్థులు, వైద్యులు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల 'సాక్షి'లో పలు కథనాలు రావటంతో పాటు వ్యక్తిగతంగా కొన్ని ఫిర్యాదులు అందటంతో శుక్రవారం రిమ్స్ ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య ఉందని గుర్తించిన కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. పెద్దగా సమస్య లేదని రిమ్స్ అధికారులు చెప్పగా.. అక్కడే ఉన్న వాష్ బేసిన్ వద్ద ట్యాప్ విప్పగా నీరు రాలేదు. దీంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు 20 లీటర్ల మినరల్ వాటర్ క్యాన్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. రెండో బోరు ఏర్పాటు చేయాలని ఏపీహెచ్ఎంహెచ్ఐడీసీ ఈఈని ఆదేశించారు. లిఫ్టు సమస్యలపై ఆరా తీశారు. హాస్టల్ సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం హెచ్ఓడీలతో సమావేశమయ్యారు. ఖాళీ పోస్టుల వివరాలను తెలియజేస్తే భర్తీకి చర్యలు తీసుకుంటానని చెప్పారు. మే మొదటి వారం నాటికి ఆస్పత్రి సలహా మండలి సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ షకీల, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, ఆర్ఎంఓలు డాక్టర్ సుభాషిని, డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ షర్మిళ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ సీపీ శ్రీదేవి, డాక్టర్ ప్రసన్న కుమార్, డాక్టర్ డి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతోనే అంతమొందించాడు

ఐదు నెలల గర్భిణి.. ఆమె కాలు తూలితేనే చూసిన వారి గుండెలు జారుతాయి. అలాంటిది ఆమెపై ఓ నలుగురు కర్కశంగా రాడ్లులతో దాడి చేశారు. నిలువునా అనుమానపు భూతం ఆవహించిన భర్త.. మృగంలా మారి దగ్గరుండి మరీ ఈ మారణ హోమం జరిపించాడు. వేగంగా పరిగెత్తి పారిపోలేని ఆమె అశక్తతను అదనుగా తీసుకుని కనికరం లేకుండా కొట్టి చంపేశారు. నమ్మి వెనక వెళ్తే ఉసురు తీశాడు.

- కిరాయి ఇచ్చి గర్భిణిని చంపించిన భర్త
- ముగ్గురితో రూ.3.50 లక్షలకు ఒప్పందం
- కేసును ఛేదించిన ఇచ్ఛాపురం పోలీసులు
- భర్తతో సహా నలుగురికి రిమాండ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

కవిటి : ప్రేమించి.. పెద్దలను ఒప్పించి అదే ఊరు అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు.. వివాహమై ఐదేళ్లు అయ్యింది.. అన్యోన్య దాంపత్యానికి మూడేళ్ల పాప జన్మించింది. రెండేళ్లుగా ఏమైందో ఏమో.. భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈలోగా భార్య గర్భం దాల్చింది.. తనకు పుట్టబోయే సంతానంపైనా అనుమానం కలిగి భార్యపై విపరీత ద్వేషం పెంచుకున్నాడు..ఎలాగైనా అంతమొందించాలని పథకం రచించాడు.. మరో ముగ్గురి సహకారంతో భార్యను గర్భిణి అని కూడా చూడకుండా దారుణంగా హతమార్చాడు. కవిటి మండలం అర్.కరాపాడు గ్రామానికి చెందిన కొంతాల మీనాక్షి భర్త దిలీప్ కుమార్ కర్కశత్వానికి బలైంది. దీనికి సంబంధించి ఇచ్ఛాపురం పోలీసులు కేసును శుక్రవారం ఛేదించారు. దిలీప్‌కుమార్‌తో పాటు హత్యలో పాలుపంచుకున్న మరో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కాశీబుగ్గ డీఎస్పీ వి.వి.అప్పారావు ఇచ్ఛాపురం సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు.

రూ. 3.50 లక్షలకు కిరాయి..

ఆర్.కరాపాడులోనే ఎలక్ట్రీషియన్‌గా ఉన్న దిలీప్‌కు అదే గ్రామానికి చెందిన మీనాక్షితోనే 2020 జులై 29న ప్రేమ వివాహమైంది. రెండేళ్లుగా భార్య మీనాక్షిపై అనుమానం పెంచుకున్న దిలీప్ కుమార్ గర్భిణి అని కూడా ఆలోచించకుండా చంపాలని మనసులో గట్టిగా నిశ్చయించుకున్నాడు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం పాత్రాపుర్ బ్లాక్ కేశరపడకు చెందిన మెట్టూరు రవికి రూ. 3.50 లక్షల కిరాయికి మాట్లాడాడు. ఇతను స్వతహాగా ఆటో డ్రైవర్ కావడం, పందుల వ్యాపారం కూడా చేస్తుంటాడు. ఇదే వ్యాపారం చేస్తున్న విశాఖపట్నం అరిలోవ కాలనీ దుర్గా బజారుకు చెందిన వనము దాసుతో వ్యాపార పరిచయముండటంతో అతనిని ఒప్పించగలిగాడు. కవిటి మండలం జాడుపూడిలో ఖాళీగా తిరుగుతున్న తోట భానుప్రసాద్‌ను కూడా హత్యలో పాలుపంచుకునేలా పురమాయించారు.

ఎలా హత్య చేశారంటే..

మీనాక్షిని వైద్యపరీక్షల నిమిత్తం భర్త దిలీప్‌కుమార్ మార్చి 28న సోంపేట వెళ్లారు. తిరుగు పయనంలో రాత్రి 8.30 గంటలకు ఆర్.కరాపాడు రైల్వేగేటు దగ్గరకు వచ్చేసరికి కొంతమంది దుండగులు భర్త ఉంటుండగానే కిరాకతకంగా దాడి చేసిన విషయం విదితమే. ఈ ఘటన జరిగిన వెంటనే భర్త దిలీప్ కుమార్ పరారవ్వడం, ఇచ్ఛాపురం సీఐ చిన్నంనాయుడు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించడం, దర్యాప్తు ప్రారంభించడంతో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పక్కా పథకం ప్రకారం దారి దోపిడీలా చిత్రీకరించాలనుకున్నారు. ఆటో, ద్విచక్రవాహనాలపై ఆర్.కరాపాడు గేటు వద్ద దారిలో కాపుకాచారు. అప్పటికే ద్విచక్రవాహనంపై భార్య మీనాక్షితో కలిసి వస్తున్న దిలీప్ బండి ఆపేయడంతో ముందుగా భానుప్రసాద్ తన వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్‌తో దాడి చేయడం, ఆ తర్వాత మిగతా ఇద్దరూ పిడిగుద్దులు గుద్దడం ఆరంభించారు. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి చేర్చినట్టు నటించి భర్త అక్కడి నుంచి పరారయ్యారు. అనుకున్న ఒప్పందం ప్రకారం మెట్టూరు రవికి భార్యను చంపాక దిలీప్‌కుమార్ రూ. 2.50 లక్షలు ఇచ్చాడని, రూ. లక్ష ఇవ్వలేదని విచారణలో తెలిసింది. ఈ మేరకు నిందితుల నుంచి ఐరన్‌రాడ్, రెండు ద్విచక్రవాహనాలు, గోల్డ్ చైన్, నాలుగు మొబైల్లు స్వాధీనం పోలీసులు చేసుకున్నారని డీఎస్పీ వివరించారు.

రెండు కేజీల గంజాయితో ముగ్గురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ పరిధిలో 2 కేజీల 140 గ్రాముల గంజాయితో ముగ్గురు వ్యక్తులను పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి. వెంకట అప్పారావు తెలిపారు. ఇచ్ఛాపురం సీఐ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ బలియార్, అతని బావ మోహన్‌దాస్‌ప్రదాన్‌లు ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడంతో గంజాయి వ్యాపారం చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో లక్ష్మీకాంత్ గంజాయిని మహారాష్ట్రలోని ఔరంగాబాద్ ప్రాంతంలో విక్రయించి వచ్చిన మొత్తాన్ని సమానంగా పంచుకునేవారు. ఈ క్రమంలో అక్కడి గంజాయి వ్యాపారి షాహాజి రామజాదవ్‌తో సికింద్రాబాద్‌లో పరిచయం ఏర్పడింది. తనకు కిలో గంజాయి అందజేస్తే రూ.7500 చెల్లిస్తానని చెప్పడంతో గంజాయి కొనుగోలు చేసి ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్దకు వచ్చారు. వీరితో పాటు అక్కడికి వచ్చిన రామజాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



ఎచ్చెర్ల క్యాంపస్: ఘటనా స్థలంలో లారీ, బైక్

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కేశవరావుపేట పంచాయతీ కింతలి మిల్లు కూడలి వద్ద జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకృష్ణ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. విజయనగరం జిల్లా రేగిడి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఈయన ద్విచక్ర వాహనంపై చిలకపాలెం వైపు వెళ్తుండగా.. కింతలి మిల్లు సమీపంలో పంక్చర్ కావటంతో ఆగి ఉన్న లారీని ఢీకొట్లాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన రామకృష్ణను 108 అంబులెన్సు ద్వారా శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేయగా.. ఆస్పత్రికి చేరుకున్న కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటబొమ్మాళి మండలానికి చెందిన సీహెచ్ రవి, డి.ప్రసాద్‌లు ద్విచక్ర వాహనంపై టెక్కలి వైపు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి రహదారి పక్కగా ఉన్న కల్వర్టులోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో బైకుపై ఉన్న ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

హమ్మయ్యా..

పెను ప్రమాదం తప్పింది!



డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

- హైవేపై రెండు కార్లు ఢీ
- చిన్నారికి గాయాలు.. క్షేమంగా బయటపడిన తల్లిదండ్రులు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై ఫరీదుపేట కూడలి కొయ్యరాళ్ల సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారికి స్వల్ప గాయాలు కాగా, ఆమె తల్లిదండ్రులు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసింహమూర్తి అనే ఉపాధ్యాయుడు విధులు ముగించుకుని శ్రీకాకుళంలోని పీఎన్ కాలనీలోని తన నివాసానికి కారులో వెళ్తున్నారు. అదే సమయంలో ఒడిశా వైపు వెళుతున్న కారు కొయ్యరాళ్ల సమీపంలోకి వచ్చేసరికి అదుపు తప్పి ఉపాధ్యాయుడి కారును ఢీకొట్టారు. ఈ ఘటనలో టీచర్ కారు డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఒడిశా వైపు వెళ్తున్న కారులో చిన్నారి లిఖితకు స్వల్ప గాయాలయ్యాయి. భార్యాభర్తలకు ఎటువంటి గాయాలు కాలేదు. ఎచ్చెర్ల ఎస్సై సందీప్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిన్నారిని ఆస్పత్రిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.



గాయపడ్డ చిన్నారి లిఖిత



దెబ్బతిన్న మరో కారు

చెరువులో గుర్తు తెలియని మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గార: మండలంలోని వాడాడ పంచాయతీ యాబాజీఖాన్ చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. శుక్రవారం మధ్యాహ్నం వాడాడకు చెందిన కొందరు వ్యక్తులు చెరువులోని గొయ్యిలో చేపలు పట్టేందుకు వెళ్లారు. మృతదేహం ఎండిన స్థితిలో కనిపించడంతో వెంటనే సచివాలయ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ ఆర్.జనార్దనరావు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీంతో తనిఖీలు జరిపించారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, నలుపు నిక్కరు, జేబులో ఖైనీ ప్యాకెట్, నోటు, చిల్లర పైసలు ఉన్నాయని చెప్పారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.